క్లుప్తంగా

విజయ సంకల్ప యాత్ర పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25న భద్రాచలం నుంచి చేపట్టే విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు కోరారు. మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సాగే ఈ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఖమ్మంలో ఆవిష్కరించగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. యాత్రను ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ ప్రారంభిస్తారని, రోజూ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర సాగుతుందని, మార్చి 2న ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్‌తో పాటు నంబూరి రామలింగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారుల ఇరుముడి

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో తిరుపతమ్మ మాలధారుల ఇరుముడి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గోపయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవాలయంలో గురుస్వాములు కంపసాటి కృష్ణ,కొమ్ము రామారావు, పెరుగు అచ్చయ్య ఆధ్వర్యాన సుమారు 18 మంది మాలధారుల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

ఆయన చూపు సజీవం


బాబురావు(ఫైల్)

కూసుమంచి: కూసుమంచికి చెందిన సంద్ర బాబురావు(68) కు గత రెండు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అతన్ని ఖమ్మం, ఆపై హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. దీంతో అతని కుటుంబసభ్యులు అతని నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు దానం చేశారు. దీంతో కుటుంబసభ్యులను పలువురు అభినందించారు.

ఐద్వా నాయకురాలి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెంకు చెందిన ఐద్వా నాయకురాలు రాయల పద్మ (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ సందర్శించి నివాళులర్పించారు. ఆమె వెంట సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, కనకయ్య, బత్తిని వెంకటేశ్వరరావు, బోజెడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి ఇండియన్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యాన ఉచిత గ్యాస్ సిలిండర్లను జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని జింకలగూడెం, గోల్‌తండా, జోగులపాడు గ్రామాలకు చెందిన మహిళలకు 150 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోగులపాడు మాజీ సర్పంచ్ నల్లబెల్లి లింగన్న, గ్రామ పెద్దలు షేక్ కరీం బానోత్ రమేష్, సుదర్శన్, షేక్ నజీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు 30 కుర్చీలు వితరణ

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక, రేగులచలక గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పరిస సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 30 కుర్చీలను శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రిష్ణకుమారి మాట్లాడుతూ.. రెండు అంగన్ వాడీ కేంద్రాలకు కలిపి చిన్నారులకు 20, పెద్దవారికి 10 కుర్చీలు అందించడం అభినందనీయమని, వారిని పలువురు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ట్రస్ట్ బాధ్యులు పరిస పుల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	46		20
బెండకాయ	56	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	56	చుక్కకూర	3
బీర	46		20
దొండ	34	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	96	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	26	పుదీన	1
క్యాప్సికం	60		20

–ఖమ్మం వ్యవసాయం

బైపాస్.. భద్రమేనా?


రాపర్తినగర్ వద్ద సిగ్నళ్లు లేకపోవడంతో గజిబిజిగా వెళ్తున్న వాహనాలు

మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న వాహనాలు

- రోడ్డు దాటాలంటేనే భయపడుతున్న జనం
- రాపర్తినగర్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు ఇదే తంతు
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీస్ యంత్రాంగం
- వేగాన్ని నియంత్రించాలని పలువురి వేడుకోలు


భయంభయంగా రోడ్డు దాటుతున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులు

వాహనాల మితిమీరిన వేగం.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. బైపాస్ రోడ్డే కదా అని స్థానిక వాహనాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వేచ్చే వాహనాలు కూడా నియంత్రణ లేని వేగంతో దూసుకుపోతున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా నివాసం ఉంటున్న వారు, పాదచారులు రోడ్డు దాటాలంటేనే జంకుతున్నారు. ప్రధాన సెంటర్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో సిగ్నల్స్ పడినా పట్టించుకోకుండా వారి ఇష్టానుసారంగా వెళ్తున్నారు. కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో వారి వేగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

ఖమ్మంమయూరిసెంటర్: సాధారణంగా జిల్లా కేంద్రంలోకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. అయితే ఇటీవల కాలంలో బైపాస్ రోడ్డును నాలుగులైన్ల రోడ్డు విస్తరించడం, ఎటువంటి ఆటంకాలు లేకపోవడంతో వాహనాలు దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు హడలిపోతున్నారు.

నిత్యం రద్దీమయం..

వరంగల్ నుంచి అశ్వారావుపేట జాతీయ రహదారికి సంబంధించి ఖమ్మంలో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ రహదారిపై భారీ నుంచి అతి భారీ వాహనాలతో పాటు కార్లు, బస్‌లు, ఇతర రవాణా వాహనాలు కూడా ఈ రహదారి మీదుగానే వెళ్తుంటాయి. ప్రస్తుతం ఈ బైపాస్ రోడ్డులోనే కొత్తగా బస్టాండ్ నిర్మించడంతో రోడ్డుకు ఇరువైపులా నివాసాల సంఖ్య పెరిగి నిత్యం రోడ్డు రద్దీగా మారింది. స్థానికులతో పాటు బయట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు అతివేగంగా వెళ్లడంతో ఇతర వాహనదారులు, నగర ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

రోడ్డు దాటేందుకు అవస్థలు..

బైపాస్‌కు ఇరువైపుల నివాసాల సంఖ్య భారీగా పెరిగింది. బైపాస్‌కు ఇటు వైపు పాత నగరం ఉండగా అవతల వైపు రాపర్తినగర్ కాలనీ, బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, రమణగుట్ట, వికలాంగుల కాలనీ, వేణుగోపాల్‌నగర్, బ్యాంక్ కాలనీ ప్రాంతాలు ఏర్పాడ్డాయి. ఈ ప్రాంతాల్లో నివాసం ఉండే వారు బైపాస్ దాటాలంటే వాహనాల వేగంతో ఇబ్బందులు పడుతున్నారు. రాపర్తినగర్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక కొత్త బస్టాండ్ లోకి వాహనాలు వచ్చి, వెళ్లాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. బైపాస్‌లో వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రాపర్తినగర్, బస్టాండ్, రెస్ట్ ఇన్ హోటల్, న్యూవిజన్ స్కూల్ ప్రాంతాల్లో వాహనాల వేగం నియంత్రణలో ఉండేలా చూడాలంటున్నారు. రాత్రి వేళ ఆయా ప్రాంతాల్లో రోడ్డు దాటేందుకు అరచేతిలో ప్రాణాలను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందంటున్నారు.

రెండు చోట్లే సిగ్నల్..

రాపర్తినగర్ బ్రిడ్జి నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు రెండు కిలోమీటర్లు దూరం ఉండగా.. వాహనాల అతివేగం ప్రమాదకరంగా మారింది. బైపాస్‌రోడ్డులో రాపర్తినగర్, ఆర్టీఓ కార్యాలయం రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మాత్రమే సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆర్టీఓ కార్యాలయం, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిగ్నల్ వ్యవస్థ పని చేస్తుండగా.. రాపర్తినగర్ వద్ద సిగ్నల్స్‌ను ఆఫ్ చేశారు. ఇక ఆర్టీఓ కార్యాలయం వద్ద సిగ్నల్స్ ఉన్నా.. పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని వాహనాలు రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్తున్నాయి. రాపర్తినగర్ కూడలి వద్ద సిగ్నల్స్ లేకపోవడం, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో వరంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు అతివేగంగా నగరంలోకి ప్రవేశించడమే కాకుండా ఆర్టీఓ కార్యాలయం రోడ్డు సిగ్నల్ వరకు అదే వేగంతో దూసుకుపోతున్నాయి. దీంతో రాపర్తినగర్ నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు రోడ్డుపై వాహనాల వేగం ప్రమాదకరంగా మారింది. ఇక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు మధ్యలో ఎక్కడా సిగ్నల్స్ లేకపోవడం, స్పీడ్ కంట్రోల్‌కు బ్రేకర్లు లేకపోవడంతో ఈ ప్రాంతంలో కూడా వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయి. రాపర్తినగర్ వద్ద, టేకులపల్లి సాగర్ కాల్వ బ్రిడ్జి వద్ద, శ్రీశ్రీ సర్కిల్‌లో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సిగ్నళ్లు పునరుద్ధరించాలి..



బైపాస్‌పై పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాటి వేగాన్ని నియంత్రించేందుకు సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నాం. ప్రధానంగా రాపర్తినగర్ వద్ద సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్ వంటివి లేకపోవడంతో నగరంలోకి ప్రవేశించిన వాహనాల వేగానికి నియంత్రణ లేకుండా పోయింది. సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్ రెండింటిలో ఒకదానిని ఏర్పాటు చేస్తే కొంతమేరకైనా వేగాలను నియంత్రించవచ్చు.

– వై.విక్రమ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

వేగాన్ని నియంత్రించాలి..



బైపాస్ రోడ్డులో వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయి. సుదూర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు నగరంలోకి ప్రవేశించగానే వాటి వేగం నియంత్రణలో ఉండేలా చూడాలి. ద్విచక్ర వాహనంతో రోడ్డును దాటాలంటే భయపడాల్సి వస్తుంది. వేగంగా వాహనాలు వస్తుండడంతో ఎక్కడ ఢీకొంటాయో అని ఆందోళన కలుగుతుంది. వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.అనూప్, నగరవాసి

నాణ్యత పాటిస్తే మంచి ధరలు


మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఏ, తదితరులు

తిరుమలాయపాలెం: పండించిన మిర్చి పంటకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతాయని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలాయపాలెం రైతు వేదికలో సాగు బాగు కార్యక్రమంలో భాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ మిర్చి పంట నాణ్యత పరిశీలనపై డేటా ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని రైతులు పండించిన పంటలను మిర్చి కల్లాల్లోనే పరీక్షించుకునే అవకాశం సంస్థ సమకూర్చడం అభినందనీయమన్నారు. మార్కెట్ వరకూ తీసుకెళ్లి నాణ్యతను పరీక్షించుకునే బదులు ఇక్కడే పరీక్షించుకుని తీసుకెళ్లొచ్చని చెప్పారు.ఈ మేరకు పిండిప్రోలు వద్ద రైతులు ఆరబెట్టిన మిర్చి పంట నాణ్యతను రైతుల సమక్షంలో పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ యశోద, మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి, ఎదుళ్లచెరువు డేటా ఆపరేటర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓను కలిసిన ఫీల్డ్ అసిస్టెంట్లు


డీఆర్‌డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కామేపల్లి: డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్యను జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం కోశాధికారి, కొమ్మినేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ ధరావత్ మాన్‌సింగ్‌నాయక్ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీతాలు, పే స్కేల్ పెంచాలని, ప్రతీ గ్రామ పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్ నియమించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సపావట్ కోటేశ్వరరావు, పర్యా, బత్తుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని గర్భరక్షాంబిక సహిత గాయత్రి అమ్మవారి దేవాలయంలో ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు శేషాచారి తెలిపారు. ఈమేరకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. దాతలు సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. వందలాది మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా ఆశ్రమంలో..

రఘునాథపాలెం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనవడు తుమ్మల యోహాన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకురాలు బానోత్ తారాదేవి ఆధ్వర్యాన రఘునాథపాలెంలోని మదర్ థెరిస్సా ఆశ్రమంలో అన్నదానం చేశారు. తొలుత ఆశ్రమంలో కేక్ కట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈర్లపూడి మాజీ సర్పంచ్ కేలోత్ దేవ్‌సింగ్, కోటేశ్, వెంకన్న బాలాజీ, రామ్మూర్తి, మండల నాయకులు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు..


మాట్లాడుతున్న ఏడీఈ కోక్యా నాయక్

కూసుమంచి: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కూసుమంచి ఏడీఈ కోక్యా నాయక్ అన్నారు. శుక్రవారం సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యాన తాగునీటి అవసరాలకు, గృహావసరాలకు, వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా జరగాలని, ఇందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో కూసుమంచి, నేలకొండపల్లి, రాజేశ్వరపురం, పాలేరు, బచ్చోడు సబ్‌స్టేషన్ల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి..


విద్యార్థినిని పరీక్షిస్తున్న డీఈఓ

ఖమ్మంరూరల్: వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యాన విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా సబ్జెక్ట్‌లపై దృష్టి సారించాలని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు.శుక్రవారం మండలంలోని కొండాపురం ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఇంకా మరింత శ్రద్ధతో విద్యార్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'మిఠాయి పొట్లం' శుభారంభం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ–20 క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన రెండు మ్యాచ్‌ల్లో మిఠాయి పొట్లం జట్టు గెలిచి ముందంజలో నిలిచింది. తొలి మ్యాచ్‌లో బాలాజీ బ్లస్టర్స్‌తో, రెండో మ్యాచ్‌లో జీవీ మాల్ జట్టుతో తలపడిన మిఠాయి పొట్లం జట్టు విజయం సాధించింది. కేపీఎల్ అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్‌కుమార్, కార్పొరేటర్ కమర్తపు మురళితో పాటు ఓలేటి సాంబమూర్తి, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి..

ఖమ్మం మామిళ్లగూడెం: తన ఇల్లు, పొలం కాజేసి తనను హతమార్చాలని చూస్తున్న వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని ఖమ్మం జిల్లా కల్లూరు గ్రామానికి చెందిన బాధితురాలు మేకల కృష్ణకుమారి జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్త చనిపోయారని, ఉమ్మడి ఆస్తిలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మార్పీకే ఎరువులు అమ్మాలి..


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

ఖమ్మంరూరల్: ప్రభుత్వం సూచించిన ఎమ్మార్పీకే రైతులకు ఎరువులు అమ్మాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయ్‌చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని పొన్నేకల్ రైతువేదికలో మండల ఎరువులు, పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రబీ కాలంలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దుకాణానికి వచ్చిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అందరికీ కనిపించేలా ధరల పట్టిక ఉంచాలని ఆదేశించారు. పంటలకు నీమ్‌కోటెడ్ యూరియా ఎక్కువ వాడకం ఉందని, దీన్ని తగ్గించి నానోయూరియా వాడాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఓ నాగేశ్వరరావు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణ డీలర్లకు అవగాహన

కామేపల్లి: మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లకు స్థానిక రైతువేదికలో ఓఎల్ఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ విధానంపై ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ప్రతీ దుకాణదారుడు తప్పనిసరిగా ఓఎల్ఎంఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు కావ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ తారాదేవి, ఏఈఓ జగదీశ్వర్, సుకన్య, డీలర్లు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం స్థానిక వైద్యాధికారి మంగళకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలతో పాటు ప్రతి నెలా నాలుగు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశఞారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలకు రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హిరాలాల్, జి.ఆనంద్, సైదావలి, సుజాత, కమలమ్మ, వీరకుమారి, కౌసల్య, పగిడికత్తుల శ్రీలత, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి అక్రమాలపై విచారణ చేపట్టాలి

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మల్లీడు అరుణ భర్త వెంకటేశ్వర్లు అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మల్లీడు వెంకటేశ్వర్లు గ్రామంలోని 679 సర్వే నంబర్‌లో ఉన్న ముస్లింల స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకున్నాడని, హిందూ స్మశాన వాటికలో అడ్డంగా తన చేలోనికి దారి నిర్మించుకుని ఇబ్బందులు కలుగుజేస్తున్నాడని ఆరోపించారు. గ్రామ చెరువులో పంచాయతీ కోసం ఏర్పాటు చేసిన బోరును ఆయన తన పంటలకు వాడుకోవడంతో పాటు చెరువు మట్టిని తవ్వి తరలించాడని, గ్రామంలో ఎల్ఐసీ సహకారంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను తన వ్యక్తిగత స్వార్థం కోసం కూల్చివేయించాడని మండిపడ్డారు. అధికారులు సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొల్లికొండ శ్రీనివాసరావు, కొండపర్తి సురేశ్, నర్రా సీతారాములు, మల్లీడు సత్యనారాయణ, చీమలదారు రాములు, బత్తుల నాగేశ్వరరావు, రెడ్డిమళ్ల వెంకన్న, సాహెబ్ హుస్సేన్, అశోక్‌రావు, సైదులు, రామారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రసాద్‌రెడ్డి పర్యటన

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శనివారం పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తామని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో వివాహాది, శుభకార్యాలు, దైవ వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

చెరువుమాధారం చెరువును వెంటనే నింపాలి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువును నీటితో వెంటనే నింపాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పొల్తీయ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అడుగంటిన చెరువుమాధారం చెరువును శుక్రవారం ఆయన పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువు ఆయకట్టు కింద ఉన్న వరి పొలాలకు సాగునీటిని విడుదల చేయకపోతే వేలాది ఎకరాలు నష్ట కోల్పోవాల్సి వస్తున్నారని, చెరువు నీటిని నిల్వను కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంతో చెరువు నీటిమట్టం తగ్గిదన్నారు. ఈనేపథ్యాన చెరువులో నీటికోసం రైతులు మోటార్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తక్షణమే చెరువుమాధారం చెరువును నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా 'సిరి చైతన్య' వార్షికోత్సవం


ఖమ్మం సహకారనగర్: నగరంలోని సిరి చైతన్య జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. తొలుత సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని వారు ప్రారంభించగా.. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ కొప్పు నరేశ్, కో ఆర్డినేటర్ శశిధర్‌రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, అడ్వకేట్ వేణుగోపాల్, మధు, కళాశాల బాధ్యులు రవీందర్, శ్రీనివాస్, నరేశ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

తపాలా స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


ఖమ్మం సహకారనగర్: విద్యార్థినిని అభినందిస్తున్న హార్వెస్ట్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఖమ్మంగాంధీచౌక్: దీన్ దయాల్ స్పర్శ్ యోజన పథకం కింద రెండు నెలల క్రితం తపాలా శాఖ సర్కిల్‌స్థాయిలో స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. పలు పాఠశాలల నుంచి మొత్తం 1,300 మంది విద్యార్థులు హాజరు కాగా 40 మంది స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వారిలో ఖమ్మం జిల్లా నుంచి హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బి.శ్రీతనిష్క(7వ తరగతి), గోర్కి పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఎ.మేఘన(8వ తరగతి) ఉన్నారు. వీరికి రూ. 6 వేలు స్కాలర్‌షిప్ మంజూరైందని, కొద్ది రోజుల్లో వాటిని ఇవ్వనున్నట్లు ఖమ్మం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ బి.రవికుమార్ శుక్రవారం ప్రకటించారు. గతేడాది కూడా నగరంలోని శాంతినగర్ పాఠశాల విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ దక్కింది. ఈ నేపథ్యాన ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఎంపికైన విద్యార్థులు వారి పాఠశాలల్లో అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఖమ్మంవన్‌టౌన్: మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

కామేపల్లి/ఖమ్మంవన్‌టౌన్: ఢిల్లీలో శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న రైతాంగంపై కేంద్ర ప్రభుత్వం కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లి మండలం ముచ్చర్లలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన సందర్భంగా లక్ష్మీనారాయణ, ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో శేఖర్‌గౌడ్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతాంగంపై పోలీసులతో జరిపిన కాల్పుల్లో ఎంతో మంది రైతులకు తీవ్ర గాయలు కావడమే కాక యువరైతు మృతికి కారణమయ్యారని మండిపడ్డారు. రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు మద్దతు ధర చట్టాన్ని చేయాలని చాలా ఏళ్లుగా పోరాడుతున్నా అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమాల్లో కోలా అప్పారావు, దర్గయ్య, తూము పిచ్చయ్య, బొడ్డుపల్లి భిక్షం, లింగం పుల్లయ్య, కొంటిముక్కల నాగేశ్వరరావు, బోడ తావురియా, చీమలదారి గోపి, సన్నీల్ల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.